# ఇంటింటి రేషన్‌కు మంగళం

- ఇకపై దూరంలో ఉన్న రేషన్‌షాపులకు వెళ్లాల్సిందే..
- రాయితీపై పంచదార, కందిపప్పు కట్

**కొత్తపేట:** తెల్లరేషన్ కార్డు కలిగిన పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన ప్రజా పంపిణీ వ్యవస్థను కూటమి ప్రభుత్వం అస్తవ్యస్తం చేసింది. కార్డుదారులకు రాయితీతో ఇవ్వాల్సిన పంచదార, కందిపప్పును పూర్తిగా కోత పెట్టింది. కేవలం బియ్యం ఇస్తూ గంజి కాచుకుని తాగమంటోంది. ఆ బియ్యం సరఫరా కూడా దూరం చేసి ఇంటింటికీ రేషన్ సరఫరాకు మంగళం పాడనుంది. ఆ మేరకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. గతంలో రేషన్ వినియోగదారులు పనులు మానుకుని రేషన్‌షాపుకు వెళ్లి గంటల తరబడి అక్కడ వేచి ఉండి రేషన్ తెచ్చుకోవలసిన పరిస్థితులకు భిన్నంగా గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ విధానం అమలు చేసింది. దాంతో వినియోగదారులు ముఖ్యంగా కుటుంబ యజమాని ఉపాధికి వెళ్లినా ఇంట్లో ఏ ఒక్కరో రేషన్ తీసుకుంటున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ విధానం రద్దు చేయాలని నిర్ణయించింది. దీంతో ఇంటికి దూరంలో ఉన్న రేషన్‌షాపుకు వెళ్లి, గంటల తరబడి వేచి రేషన్ తెచ్చుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. దాంతో వినియోగదారులు మళ్లీ మనకు వ్యయప్రయాసలు తప్పవని వాపోతున్నారు. అలాగే గత ప్రభుత్వం బియ్యంతో పాటు పంచదార, కందిపప్పు, గోధుమపిండి రాయితీ ధరలకు పంపిణీ చేయగా ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ సరుకుల పంపిణీని నిలిపివేసింది. రెండు నెలలుగా బియ్యంతోనే సరిపెడుతోంది. బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో కొనలేకున్నామని పేద, మధ్య తరగతి వర్గాలు వాపోతున్నారు. ఇచ్చే బియ్యం కూడా ఇకపై రేషన్ షాపుకు వెళ్లి తెచ్చుకోవలసిన పరిస్థితిపై పలువురు వినియోగదారులు ప్రభుత్వ నిర్వాకంపై పెదవి విరుస్తున్నారు. అధికారం కట్టబెట్టండి.. ఉద్ధరిస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వ పాలకుల నిర్ణయాలపై విమర్శలు గుప్పిస్తున్నారు.


కొత్తపేటలో తమ ఇంటి వద్దే రేషన్ తీసుకుంటున్న వినియోగదారులు

కొత్తపేట రెవెన్యూ డివిజన్‌లో రేషన్‌షాపులు, కార్డుల వివరాలు

| | |
|---|---|
| రేషన్ షాపులు | 270 |
| రేషన్ కార్డులు | 1,63,348 |
| బియ్యం | 23,450.33 క్వింటాళ్లు |

### కూటమి ప్రభుత్వ నిర్ణయం సరైంది కాదు



సంక్షేమ పథకాలను ప్రజల ఇంటి గడపకే అమలు చేయడంతో పాటు ఇంటింటికీ రేషన్ బియ్యం, నిత్యావసర సరకులు సరఫరా చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వ విధానాలకు పూర్తి విరుద్ధంగా నేటి కూటమి ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవడం సరైన పద్ధతి కాదు. రేషన్ విధానం యథావిధిగా అమలు చేయాలి. గత ప్రభుత్వం మాదిరిగా రాయితీపై నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలి.

– వి.సూర్యచంద్రరావు, ఆత్రేయపురం

## ఓ పక్క ఎండ... మరో పక్క ఉక్కబోత


అంబాజీపేటలో ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి

**అంబాజీపేట:** వాతావరణంలో మార్పుల కారణంగా కూల్‌కూల్‌గా ఉండే శ్రావణ మాసంలో సూర్యుడు తన ఉష్ణతాపాన్ని చూపిస్తున్నాడు. మరో పక్క పగలు, రాత్రి తేడా లేకుండా తీవ్రమైన ఉక్కబోతతో ప్రజలను నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోహిణి కార్తెను గుర్తు చేస్తూ ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం 8 గంటల ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఇళ్లలోంచి ప్రజలు బయటకు వచ్చేందుకు సాహసించలేదు. మధ్యాహ్నం సమయంలో అంబాజీపేట, పుల్లేటికుర్రు, ముక్కామల ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారిపోయాయి. ఎండ తీవ్రత ఇలా ఉంటే ఉక్కబోతతో చిన్నారులు, వృద్ధులు, బాలింతలు, గర్భిణులు నానా అవస్థలు పడ్డారు. వాతావరణ మార్పుల కారణంగా సాయంత్రం 6 దాటినా ఉష్ణతాపం తగ్గకపోవడం, చల్లగాలులు వీచకపోవడంతో ప్రజలు, బాటసారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

## యువత మత్తు పదార్థాల జోలికి పోవద్దు

**రావులపాలెం:** యువత మత్తు పదార్థాల వైపు పోకుండా మంచి ప్రవర్తనతో మెలగాలని పలువురు వక్తలు సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ×మత్తు పదార్థాలు- వాటి అక్రమ రవాణా× అనే అంశంపై అవగాహన కల్పించారు. అలాగే స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి కానిస్టేబుల్స్ కె.అర్జున్, టి.చినబాబు, ఎస్.రాజు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రస్తుతం యువత చెడు మార్గంలో ప్రయాణిస్తూ సమాజంలో వివిధ రకాలైనటువంటి వ్యసనాలకు లోనవుతున్నారని, ముఖ్యంగా మత్తుపదార్థాలైన గంజాయి, కొకైన్, బ్రౌన్ సుగర్, మొదలగు వాటి చెడు అలవాట్లకు యువత ఎక్కువగా గురి అవుతున్నారన్నారు. యువత ప్రపంచ దేశాలతో పోల్చినట్లయితే భారతదేశంలో ఎక్కువగా ఉందని అటువంటి యువతకి చెడు వ్యసనాలకు లోనైతే దేశం ఏ విధంగా అభివృద్ధి చెందుతుందని, యువత ఆదర్శవంతంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలు సేవించడం, అక్రమ రవాణా వంటివి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే ఎవరినైనా చట్ట ప్రకారం శిక్షిస్తామని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి భావిభారత పౌరులుగా ఉండి, విద్యతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు హరిబాబు, సోనీ, ప్రసాద్, సత్య రెడ్డి, దుర్గాదేవి, యువరాజ్, సౌజన్య, జెస్సీ పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణపై గ్రామాల్లో విస్తృత ప్రచారం


తాటిపాకలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాల నాయకులు

**రాజోలు:** ఎస్సీ వర్గీకరణ వలన జరిగే నష్టాలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని మండల జేఏసీ అధ్యక్షుడు మట్టా సురేష్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని రాజోలు, తాటిపాక, సోంపల్లి, పాదలాడ గ్రామాల్లో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల నాయకులు సమావేశాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వర్గీకరణకు వ్యతిరేకంగా చేపట్టే భారత్‌బంద్‌ను విజయవంతం చేసేందుకు న్యాయ పోరాటం అనే నినాదంతో గ్రామాల్లో మాలలను సమీకరిస్తున్నామన్నారు. వైస్ ఎంపీపీ పాలమూరి శ్యాంబాబు, జేఏసీ ప్రధాన కార్యదర్శి లిఖితపూడి బుజ్జి, నాయకులు చింతా మధు కుమార్, మండపాటి రాజేశ్వరరావు పాల్గొన్నారు.

## గ్రంథాలయ వ్యవస్థకు రంగనాథన్ విశేష కృషి


కొత్తపేటలో రంగనాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ కేపీ రాజు


రాజోలులో రంగనాథన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

**కొత్తపేట:** గ్రంథాలయ వ్యవస్థ వికాసానికి రంగనాథన్ విశేష కృషి చేశారని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు అన్నారు. గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ జయంతి పురస్కరించుకుని డిగ్రీ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైబ్రరీ సైన్స్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా రంగనాథన్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల లైబ్రరీలో వివిధ పుస్తకాలు, విలువైన గ్రంథాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కేపీ రాజు మాట్లాడుతూ భారతదేశానికి చెందిన గణిత శాస్త్రవేత్త, లైబ్రేరియన్ రంగనాథన్ లైబ్రేరియన్ సైన్స్ డాక్యుమెంటేషన్, ఇన్ఫర్మేషన్ సైన్స్ పితామహుడిగా పరిగణింపబడ్డారని తెలిపారు. ఆయన జన్మదినమైన ఆగస్టు 12న జాతీయ గ్రంథాలయ దినోత్సవంగా జరుపుకొంటున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల లైబ్రరీ ఇన్‌చార్జ్ సీహెచ్ఎస్ రాణి, లైబ్రేరియన్ జానిక్య రామ్ తదితరులు పాల్గొన్నారు.

**పుస్తక పఠనంతో ఉన్నత శిఖరాలు**

**రాజోలు:** పుస్తక పఠనం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు అన్నారు. సోమవారం లైబ్రేరియన్ డే పురస్కరించుకుని లైబ్రరీ సైన్స్ పితామహుడు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ జయంతి నిర్వహించారు. ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల గ్రంథాలయానికి దాతలు అందజేసిన ఎంతో విలువైన పుస్తకాలను ప్రదర్శించారు. పుస్తకపఠనం అలవాటు చేసుకోవాలని వార్తాపత్రికలు, కరెంట్ అఫైర్స్ పుస్తకాలు, అకాడమిక్ పుస్తకాలను చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. లైబ్రేరియన్ జగదీష్, వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, అధ్యాపకులు అశ్వని, జొన్నలగడ్డ గోపాలకృష్ణ, నల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

## అస్తవ్యస్తంగా బస్‌స్టేషన్


అస్తవ్యస్తంగా తయారైన అంబాజీపేట బస్ స్టేషన్

**అంబాజీపేట:** గతంలో ఎంతో వైభవాన్ని చూరగొని, స్థానికులతో పాటు దూరప్రాంత ప్రయాణికులకు సేవలందిస్తున్న అంబాజీపేట బస్‌స్టేషన్ నేడు అనాథగా తయారైంది. బస్‌స్టేషన్‌లో సౌకర్యాలన్నీ అస్తవ్యస్తంగా ఉన్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. కొద్దిపాటి వర్షం వస్తే బస్ స్టేషన్‌లో ప్రయాణికులు వేచి ఉండే ప్రాంతమంతా వర్షపు నీటితో తడిచి ముద్దవుతుందన్నారు. రాత్రి సమయంలో విద్యుత్ సౌకర్యం అంతంత మాత్రంగానే ఉంటుందని వాపోయారు. బస్ స్టేషన్‌లో మందుబాబుల ఆగడాలు రోజు రోజుకీ శ్రుతిమిస్తున్నాయని, బస్ కోసం ఎదురు చూసే ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని పలువురు ఆవేదన చెందారు. చీకటి పడితే మందుబాబులతో పాటు అసాంఘిక కార్యక్రమాలు జరుగుతుండటంతో ప్రయాణికులు అక్కడ వేచి ఉండటానికి భయభ్రాంతులకు గురవుతున్నారు. గతంలో ఆర్టీసీ అధికారులు బస్ స్టేషన్‌లో ఒక కంట్రోలర్‌ను నియమించి, అనంతరం తొలగించారు. ప్రస్తుతం ఇక్కడ ఎవరూ లేకపోవడంతో ఏ బస్సు ఎప్పుడు వస్తుందో సమాచారం చెప్పే నాథుడే కరువయ్యాడు. దూరప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు టాయిలెట్లకు వెళ్లాలంటే నరకం చూస్తున్నారు. టాయిలెట్స్ శుభ్రంగా లేకపోవడం, నీరు అంతంత మాత్రంగా ఉండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్ స్టేషన్ ప్రాంగణమంతా తుప్పలతో నిండిపోయి విష సర్పాలకు నిలయంగా మారిందని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్ స్టేషన్‌ను అభివృద్ధి చేసి, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

### చవితి ఏర్పాట్లపై గ్రామసభ

**అయినవిల్లి:** అయినవిల్లిలో కొలువైన విఘ్నేశ్వరస్వామికి సెప్టెంబర్ 7 నుంచి 15 తేదీ వరకూ తొమ్మిది రోజుల పాటు నిర్వహించే చవితి ఏర్పాట్లు కోసం ఆలయ ఏసీ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో సోమవారం గ్రామ సభ నిర్వహించారు. విద్యుత్ దీపాలంకరణ, పూల అలంకరణ, చలువ పందిళ్ల ఏర్పాటు వంటి అంశాలపై గ్రామస్తులతో చర్చించారు. ఆలయం ప్రాంగణంలో విశ్వేశ్వర స్వామి, కేశవస్వామివార్ల ముఖ మండపం స్లాబ్ పెచ్చులుగా ఊడిపోవడంతో దాన్ని కూల్చి కొత్తగా పునర్నిర్మించేందుకు గ్రామ సభలో ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా రక్షాబంధన మహోత్సవం


కొత్తపేట బ్రహ్మకుమారీస్ రాఖీ కార్యక్రమంలో బాలిక నృత్య ప్రదర్శన

**కొత్తపేట:** పరమపిత శివపరమాత్మ బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం కొత్తపేట శాఖ ఆధ్వర్యంలో రక్షాబంధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంవీఎస్ సుబ్బరాజు కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి నిర్వహించిన రక్షాబంధన మహోత్సవంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, అంతర్జాతీయ శిల్పి డాక్టర్ డి.రాజ్‌కుమార్‌వుడయార్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం శాఖల ద్వారా సమాజంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఆదర్శనీయమని అన్నారు. ముఖ్యంగా ప్రజల్లో సోదర భావాన్ని పెంపొందిస్తూ సమాజాన్ని చైతన్యపర్చడం అభినందనీయమన్నారు. సభలో పలువురు బాలలు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. బ్రహ్మకుమారీస్ 4 జిల్లాల ముఖ్య కార్యనిర్వాహకురాలు రాజయోగిని బ్రహ్మకుమారి రజని ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. అనంతరం సభలో పాల్గొన్న సోదరులకు అందరికీ బ్రహ్మకుమారీస్ రాఖీలు కట్టి సోదర ప్రేమను చాటుకున్నారు. సర్పంచ్ బూసి జయలక్ష్మి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి రామకృష్ణ, మండల టీడీపీ అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# సర్పంచుల శిక్షణ తరగతులు ప్రారంభం

**పాల్గొన్న ఎమ్మెల్యేలు దేవ, గిడ్డి**

**నెట్‌వర్క్:** గ్రామాల్లో సరిగా పని చేయని సర్పంచ్‌లను ఒక సాధారణ పౌరుడిగా తానే నిలదీస్తానని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు మూడు రోజుల శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఎమ్మెల్యే దేవ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గ్రామాల్లో సర్పంచ్‌లు పూర్తి బాధ్యత తీసుకుని అన్ని సమస్యలూ పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి తదితరులు పాల్గొన్నారు. పి.గన్నవరం మండల గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ సీహెచ్ త్రిశూలపాణి ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీ పాలనపై శిక్షణ తరగతులు నిర్వహించారు. పారిశుధ్య నిర్వహణ, ప్లాస్టిక్ వ్యర్థాల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, వైస్ ఎంపీపీ చెల్లుబోయిన గంగాదేవి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు. మండల గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని సఖినేటిపల్లిలో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నేటి నుంచి మూడు రోజుల పాటు సర్పంచ్‌లతో పాటు పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్-1 నుంచి గ్రేడ్-5 వరకూ ఏర్పాటు చేసిన రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమంను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరా మల్లిబాబు, జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, సర్పంచ్‌లు, గ్రేడ్-1 నుంచి గ్రేడ్-5 వరకూ కార్యదర్శులు పాల్గొన్నారు. మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కుసుమ వనజకుమారి అధ్యక్షతన సర్పంచ్‌లు, కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం జరిగింది. ఎంపీడీఓ వేణుగోలరెడ్డి మాట్లాడుతూ గ్రామాలు బాగుంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. సమావేశంలో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, ఏఓ వెంకటేశ్వరరావు, ఈఓపీఆర్డీ తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జి.సరోవర్ అధ్యక్షతన సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయతీ విధులపై సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సరోవర్ పంచాయతీ నిర్వహించే బాధ్యతలు, పరిపాలన, అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఆర్‌జీఎస్ఏ శిక్షణ శిబిరాన్ని రాజోలు ఎంపీపీ కేతా శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో ఎంపీడీఓ ఎస్.బాలాజీ అధ్యక్షతన శిక్షణ ప్రారంభమైంది. ఈఓపీఆర్డీ గిడ్ల భీమారావు, పంచాయతీ కార్యదర్శులు కోటయ్య, రజని, వివిధ గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు. ప్రజా ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఆలమూరు ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అన్నారు. ఎంపీడీఓ ఎ.మేరీరోజ్, సూపరింటెండెంట్ వి.రామ్‌స్వరూప్, ఈఓపీఆర్డీ రాజకుమార్ తదితరులు గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజా ప్రతినిధులు, అధికారులకు వివరించారు. అయినవిల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో సోమవారం సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు తదితరులు ఉన్నారు. ఆత్రేయపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీఓ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎంపీపీ కుండ అన్నపూర్ణ అధ్యక్షతన జరిగిన శిక్షణ తరగతుల్లో వేస్ట్ మేనేజ్‌మెంట్, శానిటేషన్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బోణం సాయిబాబా, సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు. రావులపాలెం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం మూడు రోజుల పాటు ఉంటుందని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. తొలిరోజు ఏపీ ఎస్ఐఆర్‌డీపీఆర్ ఉప సంచాలకులు జి.రమణ హాజరై పలు అంశాలపై అవగాహన కల్పించారు.


సర్పంచుల శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్



పి.గన్నవరంలో జరిగిన సర్పంచుల శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి

## క్లుప్తంగా

### యువకుల అరెస్ట్


గంజాయితో పట్టుబడిన యువకులతో ఎస్సై సురేష్, రెవెన్యూ అధికారులు

**మలికిపురం:** మండలంలోని గుడిమెళ్లంకలో గంజాయి తాగుతున్న ఇద్దరు యువకులను పట్టుకుని సోమవారం అరెస్టు చేశారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై వీవీవీఎస్ఎన్ సురేష్ తెలిపారు. ఇక మీదట ఎవరైనా గ్రామాల్లో గంజాయి సేవించిన లేదా గంజాయి అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సురేష్ హెచ్చరించారు.

### విద్యార్థులు విజ్ఞానాన్ని పెంచుకోవాలి


నగరంలో పాఠశాల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

**మామిడికుదురు:** విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు సూచించారు. ఆయన నగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం సందర్శించారు. విద్యార్థుల అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. డబ్బు సంపాదనే ధ్యేయంగా కాకుండా, విజ్ఞానం కోసం కష్టపడి చదువుకోవాలన్నారు. ఆ విధంగా చదువుకున్న వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. చిన్నతనం నుంచి విద్యపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. ఎన్నో ఇబ్బందులు పడుతూ కష్టపడి చదువుకుని, ఎంతో మంది ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని, అటువంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం విజయకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### సోషలిస్ట్ వ్యవస్థలో సమాన అవకాశాలు



సభలో మాట్లాడుతున్న బుచ్చిబాబు

**మలికిపురం:** సోషలిస్ట్ వ్యవస్థలోనే ప్రజలందరికీ సమాన అవకాశాలు లభిస్తాయని సీనియర్ పాత్రికేయుడు బెల్లంకొండ బుచ్చిబాబు అన్నారు. ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘ ఆవిర్భావ దినోత్సవ సభ సోమవారం మలికిపురంలో జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. సోషలిస్ట్ వ్యవస్థలో అన్ని రంగాల్లో అందరికీ సమాన అవకాశాలు ఉంటాయని ముఖ్యంగా విద్యారంగంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్య, ఉద్యోగ కల్పన కోసం కృషి చేస్తారని స్వాతంత్ర్యానికి ముందే ఆవిర్భవించిన ఏఐఎస్ఎఫ్ స్వాతంత్ర్య పోరాటంలోనే కాకుండా విద్యా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడిందని అన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ నాయకుడు దేవ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. ఇంకా ఈ సభలో సామాజికవేత్త భూపతి అజయ్ కుమార్, దీప్తి మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సుధా, మలికిపురం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సతీష్, గురయ్య కళాశాల ప్రిన్సిపాల్ రాంబాబు, అధ్యాపకులు నక్కా రమేష్‌బాబు, విద్యార్థి సంఘ నాయకులు రాపాక మహేష్, తాడి రవీంద్ర ,పోలిశెట్టి గణేష్ పాల్గొన్నారు.

### కిక్ బాక్సింగ్‌లో అబ్బులుకు గోల్డ్ మెడల్


కిక్ బాక్సింగ్ క్రియేటివ్ ఫామ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన అబ్బులు

**ఆలమూరు:** మండలంలోని కలవచర్లకు చెందిన క్రీడాకారుడు తాతపూడి అబ్బులు ప్రతిష్టాత్మక క్రియేటివ్ ఫామ్ వెపన్స్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించాడు. ఇటీవల తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని దానవాయిపేటలోని ఎస్‌కేవీటీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఇటీవల 31వ రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో క్రీడాకారుడు అబ్బులు చక్కని ప్రతిభను కనబర్చి గోల్డ్ మెడల్ సాధించారు, రాష్ట్ర కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఆనంద్ బాబు చేతుల మీదుగా అబ్బులు సోమవారం గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రాన్ని అందుకున్నాడు. వార్డు కౌన్సిలర్ ఆర్.ఆంటోనియా దాస్, గ్రాండ్ మాస్టర్ బీకే రత్నం, కిక్ బాక్సింగ్ ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధులు ఎం.గణేష్, ఎం.వెంకటగిరి, ఎం.భవానిశంకర్, వై.అంజనికుమార్ తదితరులు అబ్బులును అభినందించారు.

### రెవెన్యూ సదస్సులు విధిగా నిర్వహించాలి

**అంబాజీపేట:** గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులను విధిగా నిర్వహించాలని ఎవరూ అలసత్వం వహించవద్దని తహసీల్దార్ జె.వెంకటేశ్వరి అన్నారు. అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలకు, సర్వేయర్లకు సదస్సులపై సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సదస్సుల్లో భూ సమస్యలతో పాటు గ్రామంలో రెవెన్యూ సమస్యలపై దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 16న పసుపల్లి, 20న ముక్కామల, 22న వక్కలంక, 24న ఇరుసుమండ, 27న పుల్లేటికుర్రు, 29న కె.పెదపూడి, 31న మాచవరం, వచ్చే నెల 3న ఇసుకపూడి, 5న చిరతపూడి, 10న గంగలకుర్రు, 12న గంగలకుర్రు అగ్రహారం, 17న నందంపూడి, 19న తొండవరం, 21న వాకలగరువు, 24న మొసలపల్లి గ్రామాల్లో ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద నిర్వహించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. సమావేశంలో డీటీ పి.పద్మలక్ష్మి, ఆర్ఐ ఎండీ ఇబ్రహీం, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

### సూర్యారావు కుటుంబానికి ఆర్థిక సాయం

**అంబాజీపేట:** ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పుల్లేటికుర్రుకు చెందిన ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు, ఉత్తరాంధ్ర జిల్లాల బీజేపీ ఎస్సీ మోర్చ జోనల్ ఇన్‌చార్జి కొల్లి సూర్యారావు కుటుంబానికి ఆ పార్టీ నాయకులు సోమవారం ఆర్థిక సాయం అందించారు. కోనసీమ జిల్లా బీజేపీ అధ్యక్షుడు యాళ్ల వెంకట రామ్మోహనరావు (దొరబాబు) రూ.10 వేల ఆర్థిక సాయాన్ని సూర్యారావు కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కముపు శ్రీను, గుత్తుల సత్యనారాయణ, నూకపెయ్యి చిన్న, జంగా పల్లేశ్వరరావు, లక్కింశెట్టి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

### ఆర్అండ్‌బీ రోడ్డు మధ్యలో రంధ్రం


దిగబడిన ఆర్అండ్‌బీ రోడ్డులో పాతిన ఎర్ర జెండాలు

**మామిడికుదురు:** మొగలికుదురులోని గెద్దాడ లాకు వద్ద ఆర్అండ్‌బీ రోడ్డు మధ్యలో పెద్ద రంధ్రం పడింది. శ్లాబ్ కల్వర్టు వద్ద పడిన ఈ రంధ్రం వద్ద ప్రమాదకర పరిస్థితిని సూచిస్తూ ఎర్ర జెండాలు ఏర్పాటు చేశారు. రోడ్డు మధ్యలో రంధ్రం ఏర్పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ వాహనాలు ఆగి నెమ్మదిగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాటిపాక నుంచి కడలి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు ఇటీవల ఆధునీకరణకు నోచుకున్నా శ్లాబ్ కల్వర్టు మాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. ఈ కల్వర్టు శిథిలమైంది. ఇక్కడ తక్షణం పక్కా శ్లాబ్ కల్వర్టు నిర్మించే దిశగా ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై అధికారులు, ప్రజా ప్రతినిధులు తక్షణం స్పందించాలని కోరుతున్నారు.

### దోమల నివారణకు సహకరించాలి

**అంబాజీపేట:** నివాస ప్రాంతాల్లోను, పరిసరాల్లోనూ చెత్తా లేకుండా చూడాలని, తద్వారా దోమలను నివారించవచ్చని సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు అన్నారు. గంగలకుర్రు అగ్రహారంలో శానిటేషన్ పనులను సోమవారం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలన్నారు.

## తూడు, గుర్రపుడెక్క తొలగింపునకు నిధులు

**మామిడికుదురు:** మండల జలోని రెండు మీడియం డ్రైన్లతో పాటు ఒక మైనర్ డ్రైన్‌లో గుర్రపు డెక్క, తూడు తొలగింపునకు రూ.ఆరు లక్షల నిధులు మంజూరు చేశారు. వాడ్రేవుపల్లి మీడియం డ్రైన్‌తో పాటు వాడబోది మీడియం డ్రైన్, పాశర్లపూడి మైనర్ డ్రైన్‌లో గుర్రపు డెక్క, తూడు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో వర్షాకాలంలో ముంపు నీరు దిగక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మూడు డ్రైన్ల పరిధిలో సుమారు వెయ్యి ఎకరాల ఆయకట్టు సాగులో ఉంది. ఆయా డ్రైన్ల పరిధిలో గుర్రపు డెక్క, తూడు తొలగింపు పనులు చేపట్టామని డ్రైన్స్ ఏఈ ఆనంద్‌కిరణ్ తెలిపారు.


గుర్రపు డెక్కతో మూసుకుపోయిన వాడ్రేవుపల్లి మీడియం డ్రైన్